# బూర్గంపహాడ్ లో ఇసుక దందా..

## అధికార యంత్రాంగం మౌనం!

- సోంపల్లి ర్యాంపుల్లో జీరో దందా...
- బుడ్డగూడెంలో ఓ మంత్రి పేరుతో చోటా నాయకుడి హవా..అంటూ పలు ఆరోపణలు



2 లో...


జాతీయ తెలుగు దినపత్రిక



# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | 15 | జులై | 2026 ◆ పేజీలు : 7


# పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికేట్‌పై గందరగోళం

- రాష్ట్రమంతా ఒక తీరు.. భద్రాద్రి జిల్లాలో మరో తీరు
- మీసేవ ద్వారా రూ.180తో దరఖాస్తు చేసుకునే సౌకర్యం ఉన్నా ఆమోదంలో జాప్యం.
- రూ.1,000 చెల్లించిన దరఖాస్తులకే ఆమోదమంటు న్నారనే ఆరోపణలు.
- స్పష్టత కోరుతున్న అభ్యర్థులు.




**పాల్వంచ, జూలై 14, ప్రజాజ్యోతి:** ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో చేరే ముందు తప్పనిసరిగా సమర్పించాల్సిన పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికేట్ (పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికేట్ ) జారీ విషయంలో

మిగతా 2 లో...



6 లో..

# చిట్టి రామవరం 1/70 భూముల్లో.. రియల్టీ దందా..?

- 12 ఎకరాల్లో వెంచర్ చేసినట్లు ప్రచారం..
- అనుమతులు లేకుండానే కాగితాలపై ప్లాట్ల విక్రయాలన్న ఆరోపణలు..
- కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న స్థానికులు..

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామవరం–చిట్టి రామవరం ప్రాంతంలో సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో కొందరు రియల్ ఎస్టేట్ నిర్వాహకులు వెంచర్ ఏర్పాటు చేసినట్లు సమాచారం. అయితే ఈ భూమి 1/70 చట్టం పరిధిలో ఉన్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతుండటంతో వెంచర్ చట్టబద్ధతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం 1/70 చట్టం పరిధిలోని భూములను గిరిజనేతరులకు విక్రయించడం సాధ్యం కాదు. అలాగే అలాంటి భూముల్లో వెంచర్ ఏర్పాటుకు కూడా అనుమతులు లభించే అవకాశం ఉండదు. అయినప్పటికీ ఇక్కడ కొందరు వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్ల విక్రయాలకు పాల్పడుతున్నట్లు సమాచారం.

7 లో..



# బ్లాక్‌మెయిల్ ఉచ్చులో మైనర్...?

● 2 టౌన్ పోక్సో కేసులో వెలుగులోకి వస్తున్న కొత్త అంశాలు ● ప్రజాజ్యోతితో మాట్లాడిన బాధితురాలి వాదనలు కలకలం ● పరిచయంతో మొదలై... బ్లాక్‌మెయిల్ ఆరోపణల వరకు..! ● మైనర్ వెల్లడించిన వివరాలతో దర్యాప్తులో కొత్త కోణం ● ప్రతి అంశాన్ని సమగ్రంగా విచారించాలన్న డిమాండ్ ● మరికొందరి పాత్రపైనా ఆరా..? ● దర్యాప్తు వేగంపై స్థానికుల్లో ప్రశ్నలు ● నేడు పోలీసుల అధికారిక వివరణపై ఉత్కంఠ

# అనధికారిక డంపింగ్ యార్డులో చెత్త దహనం

- విషపొగలతో విలవిల్లాడిన వీరునాయక్ తండా.
- డంపింగ్ యార్డులో చెత్త దహనం.. గ్రామాన్ని కమ్మేసిన పొగ
- ప్రజల ప్రాణాలతో చెలగాటమా..? డంపింగ్ యార్డుపై గ్రామస్థుల ఆగ్రహం
- అనధికారిక డంపింగ్ యార్డు కారణంగా వీరునాయక్ తండాలో ఊపిరాడని పరిస్థితి.
- చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోశ రోగులు తీవ్ర ఇబ్బందులు.
- చెత్తకు నిప్పంటించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్



2 లో...

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం

- ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, నీటి సంరక్షణ పద్ధతులపై రైతువేదికలో సూచనలు



**అన్నపురెడ్డిపల్లి, జూలై 14 (ప్రజాజ్యోతి):** అన్నపురెడ్డిపల్లి రైతు వేదికలో మంగళవారం ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు, వాటి ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు, రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారి అనూష రైతులను ఉద్దేశించి ఎల్‌నినో ప్రభావంతో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే పరిస్థితులు ఏర్పడవచ్చని వివరించారు. ఈ వాతావరణ పరిస్థితుల ప్రభావంతో పంటలకు నీటి కొరత ఏర్పడటం, విత్తనాల మొలక శాతం తగ్గిపోవడం, పంటల ఎదుగుదల మందగించడం, దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో సాగు పనులు చేపట్టాలని సూచించారు. నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, భూమిలో తేమ నిల్వ ఉండేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే తక్కువ కాలంలో పండే, తక్కువ నీటి అవసరమయ్యే పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని చెప్పారు. వర్షాధార సాగు చేసే రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలుగా పెసర, మినుములు, కందులు, జొన్నలు, సజ్జలు, నువ్వులు వంటి పంటలు తక్కువ నీటితో సాగు చేసి మెరుగైన ఫలితాలు సాధించవచ్చని వివరించారు. వాతావరణ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరానికి అనుగుణంగా సాగు నిర్ణయాలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లకావత్ లక్ష్మి, ఉప సర్పంచ్ మారగాని అశోక్, వ్యవసాయ అధికారి అనూష, వ్యవసాయ శాఖ సిబ్బంది, మండలంలోని పలువురు రైతులు పాల్గొన్నారు.

## రూ.2.25 కోట్లతో టేకులపల్లికి నూతన తహసిల్దార్ కార్యాలయం

- స్థలాన్ని పరిశీలించిన హౌసింగ్ శాఖ అధికారులు.. త్వరలో భవన నిర్మాణానికి శ్రీకారం



**టేకులపల్లి, జూలై 14,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలానికి అత్యాధునిక వసతులతో కూడిన నూతన తహసిల్దార్ కార్యాలయ భవనం నిర్మాణానికి అడుగులు వేగంగా పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2.25 కోట్ల నిధులతో నిర్మించనున్న కార్యాలయ భవనానికి మంగళవారం తెలంగాణ హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులు స్థల పరిశీలన నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల స్థానంలో నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం జీవో నెం.375 (తేదీ25-06-2026) ద్వారా 10 ఆర్డీవో కార్యాలయాలు, 107 తహసిల్దార్ కార్యాలయాల నిర్మాణానికి రూ.263.25 కోట్లు మంజూరు చేసింది. ఇందులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు నాలుగు తహసిల్దార్ కార్యాలయ భవనాలు మంజూరు కాగా, టేకులపల్లి కార్యాలయం కూడా చోటు దక్కించుకోవడం విశేషం. ఈ నేపథ్యంలో టేకులపల్లికి చేరుకున్న హౌసింగ్ శాఖ అధికారులు, ప్రస్తుతం ఉన్న తహసిల్దార్ కార్యాలయ ఆవరణలోనే నిర్మించనున్న నూతన భవనానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. తహసిల్దార్ ఎల్. వీరభద్రం స్థలాన్ని చూపించగా, అధికారులు నిర్మాణానికి అవసరమైన ప్రాథమిక కొలతలు చేపట్టారు. స్థల పరిశీలనలో హౌసింగ్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాయిరాం, డీఈ ఖలీల్, జేఈ గణేష్, రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ఎల్. వీరభద్రం మాట్లాడుతూ, త్వరలోనే నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని, ఆధునిక వసతులతో కూడిన కార్యాలయం అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు వేగవంతమైన, మెరుగైన రెవెన్యూ సేవలు అందుతాయని తెలిపారు. కొత్త భవనం నిర్మాణంతో మండల ప్రజల చిరకాల కోరిక నెరవేరనున్నట్లు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బూర్గంపహాడ్ లో ఇసుక దందా..



**బూర్గంపహాడ్, జూలై 14 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల పరిధిలోని సోంపల్లి, బుడ్డగూడెం ఇసుక ర్యాంపుల్లో అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ అక్రమ దందాపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా, సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించడం విస్మయానికి గురిచేస్తోంది.

- ♦ అధికారుల మౌనం.. అనుమానాలకు తావు

ఈ ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందని బహిరంగంగానే విమర్శలు వస్తున్నా, క్షేత్ర స్థాయిలో విచారణ జరపకపోవడంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమాల్లో అధికారుల వాటా ఎంత? అందుకే మౌనం పాటిస్తున్నారా? అనే ప్రశ్నలు ప్రజల నుంచి బలంగా వినిపిస్తున్నాయి.

- ♦ మంత్రి పేరుతో జేబులు నింపుకుంటున్నారా?

ప్రభుత్వం అధికారికంగా ఇసుక ర్యాంపులను కేటాయించినప్పటికీ, అవేమీ పట్టించుకోకుండా కొందరు అక్రమార్కులు ఓ మంత్రి పేరును అడ్డుపెట్టుకుని ఇసుక దందాకు తెగబడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు అందాల్సిన ఆదాయం పక్కదారి పడుతోందని, అక్రమార్కులు అడ్డదారిలో సొమ్ము చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక మాఫియా కార్యకలాపాలతో స్థానిక రహదారులు ధ్వంసమవుతుండటమే కాకుండా, పర్యావరణానికి కూడా ముప్పు వాటిల్లుతోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి, క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికేట్‌పై గందరగోళం

(మొదటి పేజీ తరువాయి…)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నెలకొన్న పరిస్థితులు ప్రజల్లో తీవ్ర గందరగోళానికి దారితీస్తున్నాయి. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో అమలవుతున్న విధానానికి భిన్నంగా ఇక్కడ వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగాల కోసం ఎంపికైన అభ్యర్థులు తమపై ఎలాంటి నేర చరిత్ర లేదని ధ్రువీకరించే పత్రమే పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికేట్. ఈ ధ్రువీకరణ పత్రాన్ని ఉద్యోగంలో చేరే ముందు సంబంధిత సంస్థలకు సమర్పించడం అనేక సందర్భాల్లో తప్పనిసరిగా ఉంటుంది. ప్రస్తుతం ఈ సర్టిఫికేట్ కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు విధానాలు అమలులో ఉన్నట్లు తెలుస్తోంది. మొదటి విధానంలో అభ్యర్థులు మీసేవ కేంద్రాల ద్వారా రూ.180 చలానా చెల్లించి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. దరఖాస్తు అనంతరం నిర్ణీత వ్యవధి పూర్తయిన తర్వాత అదే మీసేవ కేంద్రం ద్వారా సర్టిఫికేట్ పొందే విధంగా ఈ సేవ అందుబాటులో ఉంది. అయితే, మీసేవ ద్వారా రూ.180 చెల్లించి దరఖాస్తు చేసిన అనేక కేసుల్లో సర్టిఫికెట్లు ఆమోదం పొందడం లేదని బాధితులు వాపోతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను సంప్రదిస్తే, రూ.180తో మీసేవ ద్వారా దాఖలు చేసిన దరఖాస్తులకు ఆమోదం ఇవ్వడం సాధ్యం కాదని, రూ.1,000 ఫీజుతో ఆన్‌లైన్‌లో లేదా బ్యాంక్ డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ) ద్వారా సమర్పించిన దరఖాస్తులకే ఆమోదం ఇస్తున్నామని కొందరు పోలీసు అధికారులు చెబుతున్నట్లు అభ్యర్థులు పేర్కొంటున్నారు. దీంతో ప్రజల్లో తీవ్ర అయోమయం నెలకొంది. ఒకవైపు ప్రభుత్వం డిజిటల్ సేవలను ప్రోత్సహిస్తూ మీసేవ ద్వారా ఈ సేవను అందుబాటులో ఉంచగా, మరోవైపు అదే దరఖాస్తులకు ఆమోదం లభించకపోతే ఆ సేవ ఉద్దేశమేంటనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మీసేవ ద్వారా రూ.180 చెల్లించి దాఖలు చేసిన పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికేట్ దరఖాస్తులకు ఆమోదం లభిస్తున్నట్లు అభ్యర్థులు పేర్కొంటున్నారు. అయితే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాత్రం రూ.1,000 ఫీజుతో దాఖలైన దరఖాస్తులకే ప్రాధాన్యం ఇస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఈ వ్యత్యాసానికి గల కారణాలపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి స్పష్టత వెలువడలేదు. డిజిటల్ ఇండియా లక్ష్యాలకు అనుగుణంగా ప్రభుత్వ సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొస్తున్న ఈ తరుణంలో, మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న తర్వాత కూడా మరోసారి జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఎందుకు వస్తోందని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం అందుబాటులో ఉంచిన సేవ అమలులోనే ఇలాంటి సందిగ్ధ పరిస్థితులు నెలకొనడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ ప్రత్యేక చొరవ తీసుకుని పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికేట్ జారీ విధానంపై స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయాలని, మీసేవ ద్వారా దాఖలు చేసే దరఖాస్తులు ఆమోదయోగ్యమా? లేక రూ.1,000 ఫీజుతో దాఖలు చేసే దరఖాస్తులకే అనుమతి ఉందా? అనే అంశంపై అధికారికంగా ప్రజలకు అవగాహన కల్పించాలని అభ్యర్థులు, మీసేవ నిర్వాహకులు కోరుతున్నారు. అధికారుల నుంచి స్పష్టమైన వివరణ వెలువడితే ప్రజల్లో నెలకొన్న గందరగోళం తొలగడంతో పాటు, అభ్యర్థులు అనవసర ఖర్చులు, ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వ సేవలను సులభంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# అనధికారిక డంపింగ్ యార్డులో చెత్త దహనం

- విషపొగలతో విలవిల్లాడిన వీరు నాయక్ తండా.
- డంపింగ్ యార్డులో చెత్త దహనం.. గ్రామాన్ని కమ్మేసిన పొగ
- ప్రజల ప్రాణాలతో చెలగాటమా..? డంపింగ్ యార్డుపై గ్రామస్థుల ఆగ్రహం
- అనధికారిక డంపింగ్ యార్డు కారణంగా వీరునాయక్ తండాలో ఊపిరాడని పరిస్థితి.
- చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోశ రోగులు తీవ్ర ఇబ్బందులు.
- చెత్తకు నిప్పంటించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్.



**పాల్వంచ, జూలై 14, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండల పరిధిలోని వీరునాయక్ తండా సమీపంలో ఉన్న అనధికారిక డంపింగ్ యార్డులో చెత్తకు నిప్పంటించడంతో భారీ ఎత్తున వ్యాపించిన విషపూరిత పొగ గ్రామాన్ని కమ్మేసింది. దీంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉక్కిరిబిక్కిరి అయ్యారు. గ్రామస్థుల కథనం ప్రకారం, మంగళవారం సాయంత్రం సుమారు 6 గంటల నుంచి డంపింగ్ యార్డు నుంచి ఎగిసిపడిన దట్టమైన పొగ క్రమంగా గ్రామమంతా వ్యాపించింది. రాత్రి 10 గంటల సమయానికి పరిస్థితి మరింత విషమించడంతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడిందని, పలువురు గ్రామస్థులు ఇళ్ల నుంచి బయటకు వచ్చి రోడ్లపై నిలబడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లలో ఫ్యాన్లు లేదా కూలర్లు ఆన్ చేస్తే పొగ నేరుగా గదుల్లోకి చేరి ఊపిరి తీసుకోవడం కూడా కష్టంగా మారిందని గ్రామస్థులు తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, ఉబ్బసం (అస్తమా) మరియు ఇతర శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వారు తీవ్ర అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి సమీపంలోనే చెత్తను డంపింగ్ చేయడం, అనంతరం దానికి నిప్పంటించడం వల్ల వెలువడే విషవాయువులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని స్థానికులు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనల వల్ల భవిష్యత్తులో ఎవరైనా అనారోగ్యానికి గురైనా లేదా ప్రాణనష్టం సంభవించినా బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. గ్రామానికి అత్యంత సమీపంలో అనధికారికంగా డంపింగ్ యార్డును నిర్వహించడం ఎలా సాధ్యమైందని, చెత్తను అక్కడ వేస్తున్నవారు ఎవరు, దానికి నిప్పంటించిన వారు ఎవరో గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. అలాగే అనధికారికంగా చెత్తను పారబోసే వారిపై భారీ జరిమానాలు విధించాలని, డంపింగ్ యార్డును వెంటనే తొలగించి గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించాలని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# ఎల్‌నినో ఎఫెక్ట్ తో వరి సాగుకు గండం..!

- ప్రత్యామ్నాయ పంటలే రైతులకు రక్షణ కవచం
- గతేడాది 10 వేల ఎకరాలు... ఈసారి వెయ్యి ఎకరాలకే పరిమితం
- చెరువుల్లో నీరు లేదు... భూగర్భ జలాలు అడుగంటాయి
- దమ్మపేట రైతు వేదికలో వ్యవసాయ శాఖ హెచ్చరిక
- అపరాలు, చిరుధాన్యాల సాగుతో నష్టాలను తగ్గించుకోవాలని రైతులకు సూచన







**దమ్మపేట, జూలై 14(ప్రజాజ్యోతి):** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని, అధిక నీటి అవసరమయ్యే వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని వ్యవసాయ శాఖ రైతులకు సూచించింది. ఈ మేరకు దమ్మపేట మండల రైతు వేదికలో మంగళవారం రైతులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు.సమావేశంలో మండల వ్యవసాయ అధికారి ఎస్. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, గత ఏడాది ఇదే సమయానికి మండలంలో సుమారు 10వేల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, అయితే ఈ ఏడాది ఇప్పటివరకు వెయ్యి ఎకరాల లోపే వరి నాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఇది ప్రస్తుత వాతావరణ పరిస్థితుల తీవ్రతకు నిదర్శనమని పేర్కొన్నారు.ప్రస్తుతం చెరువులు, కుంటలు నీటితో నిండకపోవడం, బోర్లలో నీటి మట్టం గణనీయంగా పడిపోవడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల వరి సాగు ప్రమాదంలో పడిందన్నారు. రైతులు సంప్రదాయ పద్ధతిలో వరిపై మాత్రమే ఆధారపడకుండా పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం జూలై, ఆగస్టు నెలల్లో కూడా కొనసాగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అంచనాలను ప్రస్తావిస్తూ, రైతులు నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని పెసర, మినుము, కంది, అలసంద, జొన్న, సజ్జ, రాగులు వంటి అపరాలు, చిరుధాన్యాలు తక్కువ నీటితో సాగయ్యే పంటలను సాగు చేస్తే మెరుగైన ఫలితాలు పొందవచ్చని తెలిపారు.అలాగే రైతులు వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటించాలని, ఎలాంటి సందేహాలున్నా సమీప వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించడం, శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టడం ద్వారా నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, దమ్మపేట ఏఈఓ అను బాబు, వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రగతిశీల రైతులు, మండలంలోని వివిధ గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులతో అధికారులు ప్రత్యక్షంగా చర్చించి, ప్రస్తుత ఖరీఫ్ పరిస్థితులు, పంటల ఎంపిక, నీటి యాజమాన్యం, ప్రత్యామ్నాయ సాగు విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు.

### ››› ఎల్‌నినో అంటే ఏమిటి?

ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల ఏర్పడే వాతావరణ ప్రభావం. దీని ప్రభావం ప్రపంచంలోని అనేక దేశాలపై పడుతుంది. భారతదేశంలో ముఖ్యంగా నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉండటంతో వర్షపాతం తగ్గుతుంది. ఎల్‌నినో అనేది వర్షాలు తగ్గి, వేడి పెరిగేలా చేసే వాతావరణ పరిస్థితుల్లో మార్పు. దీని వల్ల భారతదేశంలో ముఖ్యంగా వర్షాకాలంలో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది."

### ››› ఎల్‌నినో ప్రభావం :

సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుంది.కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంటుంది.చెరువులు, కుంటలు, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతాయి.భూగర్భ జలమట్టం పడిపోతుంది.వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు ఇబ్బందులు ఎదురవుతాయి.రైతులు తక్కువ నీటితో సాగయ్యే పంటల వైపు మళ్లాల్సిన అవసరం ఏర్పడుతుంది.

## ప్రతి ఓటరికి ఫారం అందాలి

- ఎన్యూమరేషన్ ప్రక్రియను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్ మురళి





**చర్ల, జూలై 14:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలం ఆర్.కొత్తగూడెం గ్రామ పంచాయతీలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఎన్యూమరేషన్ ప్రక్రియను ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం. మురళి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామంలో ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ పనులను పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఓటర్లను ఎలా సంప్రదిస్తున్నారు, ప్రతి ఇంటికి ఫారాలు చేరుతున్నాయా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఫారాల పంపిణీ, సేకరణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని తగిన సూచనలు చేశారు.అనంతరం గ్రామస్తులతో మాట్లాడిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మురళి ప్రతి అర్హత కలిగిన ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం తప్పనిసరిగా అందేలా బీఎల్‌వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎవరి ఓటు హక్కు కూడా కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ప్రతి కుటుంబం ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్‌వోలకు అందజేయాలని కోరారు.ఎవరికైనా ఎన్యూమరేషన్ ఫారం అందకపోయినా, వివరాల్లో ఏవైనా పొరపాట్లు ఉన్నా వెంటనే సంబంధిత బీఎల్‌వోను సంప్రదించి సరిదిద్దుకోవాలని సూచించారు.

## హిడమయ్య కుటుంబానికి విహెచ్‌పీ చేయూత

- రూ.20 వేల విలువైన నిత్యవసర వస్తువుల పంపిణీ



**చర్ల, జూలై 14:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలం బక్కచింతలపాడు గ్రామానికి చెందిన మడకం హిడమయ్య పాల్వంచలో గృహ నిర్మాణ పనులు చేస్తుండగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో హిడమయ్య రెండు కాళ్లు తీవ్రంగా కాలిపోవడంతో పాటు రెండు చేతులు కూడా సరిగా పనిచేయని పరిస్థితికి చేరుకున్నారు.ఈ విషయం తెలుసుకున్న విశ్వహిందూ పరిషత్ ప్రఖండ నాయకులు బాధిత కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించి మంగళవారం దాతల సహకారంతో సుమారు రూ.20 వేల విలువైన బియ్యం, నిత్యవసర సరుకులు, కూరగాయలు, పండ్లు, దుస్తులను అందజేశారు. ఇలాంటి క్లిష్ట సమయంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధిత కుటుంబానికి చేయూత అందించాలని వారు కోరారు.ఈ సేవా కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రఖండ నాయకులు శివరాజు కిషోర్, ఇరసవడ్ల రాము, మీసాల శ్రీనివాస్‌తో పాటు శ్రీవాణి విద్యానికేతన్ పద్మజా, సీసీ కెమెరా శ్రీకర్, నవీన్ ఫ్యాన్సీ, ఎలక్ట్రికల్ షాప్ వెంకటరావు, గాదంశెట్టి దీప్, తోటపల్లి వంశీ, ఆశపు సాయి, పెద్దాడ సాయి, అలవాల మురళి, చింతలపూడి అశోక్ దాతలు పాల్గొన్నారు.

## ప్రజల ఓటు హక్కు పరిరక్షణే అందరి బాధ్యత

- ఓటు హక్కు కాపాడుదాం... సర్ (ఎస్ఐఆర్) ను విజయవంతం చేద్దాం
- పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పిలుపు



**దమ్మపేట, జూలై 14(ప్రజాజ్యోతి):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు )తో పాటు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.ఈ నెల 24వ తేదీతో ఎస్ఐఆర్ కార్యక్రమం ముగియనున్న నేపథ్యంలో, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామం, ప్రతి బూత్ పరిధిలోని ఓటర్లను స్వయంగా కలిసి వారికి దరఖాస్తు ఫారాలు అందాయా లేదా అని ఆరా తీయాలని సూచించారు. ఫారాలు అందని వారికి సంబంధిత ఎన్నికల అధికారులతో మాట్లాడి వెంటనే ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే ఫారాలు అందుకున్న ఓటర్లు వాటిని పూర్తిగా, ఎలాంటి తప్పులు లేకుండా సక్రమంగా నింపారా లేదా అని పరిశీలించాలని, అవసరమైతే వారికి సహాయం చేసి దరఖాస్తులను సరిగా పూర్తి చేయించాలని సూచించారు. నింపిన ఫారాలను సంబంధిత అధికారులు లేదా సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేశారా లేదా అనే విషయాన్ని కూడా తప్పనిసరిగా ధృవీకరించాలని తెలిపారు.మాజీ మండల అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ స్థాయి నాయకులు ఈ కార్యక్రమాన్ని పార్టీ బాధ్యతగా కాకుండా ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగమైన వ్యక్తిగత బాధ్యతగా భావించి క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆయన కోరారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైనా, ఫారాలు అందకపోయినా, దరఖాస్తుల స్వీకరణ లేదా ఆన్‌లైన్ నమోదులో సమస్యలు ఉన్నా వెంటనే పార్టీ నాయకత్వానికి సమాచారం అందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.అర్హులైన ఒక్క ఓటరికి కూడా అన్యాయం జరగకుండా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే మూలస్తంభమని, ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు ప్రతి బీఆర్ఎస్ నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

## జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ ఇవ్వాలని వినతి



**బూర్గంపహాడ్,జూలై14 (ప్రజా జ్యోతి):** జర్నలిస్టుల పిల్లల విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని వారి చదువులకు ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బూర్గంపహాడ్ మండల విద్యావనరుల కేంద్రంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు జేవి రత్నం ఆదేశాల మేరకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) యూనియన్ నాయకులు మండల విద్యాశాఖ అధికారి యదు సింహారాజుకు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం సమాచారాన్ని అందించే క్రమంలో జర్నలిస్టులు ఎన్నో సవాళ్లను, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న విద్యా ఖర్చుల కారణంగా జర్నలిస్టుల కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఎయిడెడ్,ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ఈ అంశంపై సానుకూలంగా స్పందించి, జర్నలిస్టుల సంక్షేమానికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.వినతిపై స్పందించిన మండల విద్యాశాఖ అధికారి యదు సింహారాజు ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేసేందుకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని తెలిపారు.త్వరలోనే మండలంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లా ఉపాధ్యక్షులు డొంకన చంద్రశేఖర్, ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ సహాయ కార్యదర్శి సాంబరెడ్డి, నియోజకవర్గ ఆర్గనైజింగ్ మెంబర్ నరసింహారెడ్డి, నియోజకవర్గ ఉపాధ్యక్షులు శివకుమార్, ఎలక్ట్రానిక్ మీడియా ఈసీ సభ్యులు రవి, సభ్యులు జక్కిరెడ్డి మల్లారెడ్డి, డి శ్రీనివాస్, కోటా రమేష్, రాంబాబు, చేతుల శ్రీనివాస్, సుధాకర్, ముజఫర్, కేసుపాక రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఆళ్ళపల్లి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ

- విద్యార్థులతో మాట్లాడి మెనూ అమలుపై మండల అధికారుల ఆరా



**ఆళ్ళపల్లి,జూలై14(ప్రజాజ్యోతి)**ఆళ్లపల్లి మండలంలో (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు, ప్రజాప్రతినిధులతో కలిసి స్థానిక ప్రాథమిక పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలను మండల రెవిన్యూ అధికారులు. గడ్డం ఉమాదేవి. డీటీ. బాధవత్ భద్రు సందర్శించి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంపై అధికారులు ప్రత్యేకంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, భోజనం నాణ్యత ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వండిన ఆహారాన్ని ప్రత్యక్షంగా తనిఖీ చేసి పరిశుభ్రత, నాణ్యత, మెనూ అమలుపై సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సక్రమంగా అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఎల్‌వోలు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్, సర్పంచులు సుస్మిత.రమాదేవి గ్రామస్తులు చిరంజీవి కృష్ణ భరత్ మంగ కృష్ణ హరి సత్యనారాయణ భరత్ అతహర్ పార్టీ నాయకులు.గ్రామ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాలంటే అంత అలుసా!

- బేకరీలలో కేకులు, తినుబండారాలు తింటే అనారోగ్య పాలేనా!
- ప్రజల ప్రాణాలతో బేకరీలు చెలగాటం?
- కూల్ కేకులు తిని భార్య, భర్తలకు వాంతులు.. విరోచనాలు!
- గతంలో సైతం బేకరీలలో కల్తీ తినుబండారాలు తిని పలువురి అస్వస్థత!
- కాలం చెల్లిన తినుబండారాలను 'ఫేమస్'గా విక్రయాలు!
- కల్తీ తినుబండారాలపై ప్రశ్నిస్తే బుకాయింపులు!
- పట్టించుకోని ఫుడ్ సేఫ్టీ అధికారులు!
- లోపాయికార ఒప్పందాలే తనిఖీలకు తిలోదకాలా?




**ఇల్లందు, జులై 14 (ప్రజా జ్యోతి)** పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ ఇష్టంగా తినే కేకులు, బ్రెడ్‌లు, బిస్కెట్లు, పఫ్‌లు, క్రీమ్ రోల్స్, కూల్ కేకులు వంటి బేకరీ ఉత్పత్తులు ఇప్పుడు ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా, కాలం చెల్లిన తినుబండారాలకు కొత్త ప్యాకింగ్, కొత్త లేబుళ్లు వేసి విక్రయిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లాభాల కోసం కొందరు బేకరీ యజమానులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే ఆందోళన వ్యక్తమవుతుంది.

### ప్రజల ప్రాణాలతో బేకరీలు చెలగాటం!

నిత్యం వందలాది మంది కొనుగోలు చేసే బేకరీ ఉత్పత్తుల్లో నాణ్యత లేకపోవడం, పరిశుభ్రత ప్రమాణాలు పాటించకపోవడం, నిల్వ విధానాల్లో నిర్లక్ష్యం కారణంగా వినియోగదారుల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు ఎక్కువగా తినే క్రీమ్ కేకులు, చాక్లెట్ పదార్థాలు సరైన శీతలీకరణ లేకుండా గంటల తరబడి ఉంచుతున్నట్లు చెబుతున్నారు.

### కూల్ కేకులు తిని భార్య, భర్త వాంతులు.. విరోచనాలు

ఇటీవల ఓ దంపతులు బేకరీలో కొనుగోలు చేసిన కూల్ కేక్ తిన్న అనంతరం వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురైన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. వైద్యుల వద్ద చికిత్స పొందాల్సిన పరిస్థితి ఏర్పడిందని సమాచారం. ఈ ఘటనతో బేకరీల్లో విక్రయించే ఆహార పదార్థాల నాణ్యతపై ప్రజల్లో ఆందోళన పెరిగింది.గతంలో సైతం కల్తీ తినుబండారాలతో అస్వస్థత ఇది మొదటిసారి కాదని స్థానికులు చెబుతున్నారు. గతంలో కూడా కాలం చెల్లిన లేదా నాణ్యతలేని బేకరీ ఉత్పత్తులు తిని పలువురు అస్వస్థతకు గురైన సంఘటనలు జరిగినప్పటికీ, వాటిపై సంబంధిత అధికారులు సమగ్ర చర్యలు తీసుకోలేదని విమర్శిస్తున్నారు.

### కాలం చెల్లిన తినుబండారాలను 'ఫేమస్'గా విక్రయాలు!

బేకరీలలో కాలం చెల్లిన కేకులు, బ్రెడ్‌లు, బిస్కెట్లు, ఇతర తినుబండారాలపై ఉన్న తేదీలను మార్చడం లేదా కొత్త ప్యాకింగ్‌లో విక్రయించడం జరుగుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వినియోగదారులు పేరును నమ్మి కొనుగోలు చేస్తుండగా, నాణ్యత విషయంలో మాత్రం మోసపోతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కల్తీ తినుబండారాలపై ప్రశ్నిస్తే బుకాయింపులు

నాణ్యతపై లేదా గడువు తేదీపై ప్రశ్నించిన వినియోగదారులకు స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా, వివిధ కారణాలు చెబుతూ తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. కొన్నిసార్లు వినియోగదారులపైనే తప్పు నెట్టే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని చెబుతున్నారు.

### పట్టించుకోని ఫుడ్ సేఫ్టీ అధికారులు

ఆహార భద్రతా నిబంధనలను అమలు చేయాల్సిన సంబంధిత శాఖ అధికారులు ఇల్లందు బేకరీలపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తనిఖీలు లేకపోవడంతో కొందరు నిర్వాహకులు నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

### లోపాయికార ఒప్పందాలే తనిఖీలకు తిలోదకాలా?

ఇల్లందు బేకరీలపై చర్యలు లేకపోవడం, ఫిర్యాదులు వచ్చినా స్పందన కనిపించకపోవడంతో సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులు, నిర్వాహకుల మధ్య ఏవైనా లోపాయికారి ఒప్పందాలు ఉన్నాయా అనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతలేని ఆహార పదార్థాలు బహిరంగంగా విక్రయమవుతున్నప్పటికీ, సంబంధిత ఫుడ్ సేఫ్టీ శాఖల నుంచి కఠిన చర్యలు లేకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇప్పటికైనా సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులు బేకరీల్లో విక్రయించే అన్ని ఆహార పదార్థాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, గడువు ముగిసిన లేదా నాణ్యతలేని తినుబండారాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి ఉత్పత్తిపై తయారీ తేదీ, గడువు తేదీ స్పష్టంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే బేకరీల లైసెన్సులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్



**పాల్వంచ, జూలై 14, ప్రజాజ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్‌ను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, గద్దల రమేష్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంలో పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడుతూ పరస్పరం ఆత్మీయంగా చర్చించారు.ఈ భేటీ ఆత్మీయ వాతావరణంలో సాగగా, జిల్లా ప్రజల అభ్యున్నతికి పోలీసు శాఖ చేపడుతున్న చర్యలు అభినందనీయమని గద్దల రమేష్ పేర్కొన్నారు.

## ఎల్.వి. ప్రసాద్ కంటి ఆస్పత్రి సేవలు ప్రశంసనీయం

- కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి

**పాల్వంచ, జూలై 14, ప్రజాజ్యోతి:**పాల్వంచలోని ఎల్.వి. ప్రసాద్ కంటి ఆస్పత్రి పేద ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు ప్రశంసనీయమని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి అన్నారు.మంగళవారం పాత పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎల్.వి. ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన విమలాదేవి మాట్లాడుతూ, ఎల్.వి. ప్రసాద్ కంటి ఆస్పత్రి ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని, ఈ సేవలను అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎల్.వి. ప్రసాద్ ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ దేవీ చందర్ రావు, విజన్ సెంటర్ కోఆర్డినేటర్ ఆర్. వినోద్, కీర్తి, ఫీల్డ్ అసిస్టెంట్ బి. జ్యోతి, ఆప్టికల్ అసిస్టెంట్ ఎన్. అరుణ, విజన్ టెక్నీషియన్లు అచ్యుత్, పావని, దేవి, జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పద్మలత, ఎన్. శ్రీనివాస్, గ్రామస్తులు షేక్ ఖాజామియా, బూసి శీను, యాటా నాని, ఆర్‌పీలు నాగమణి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



# దొంగలు బాబోయ్... దొంగలు..!

- కార్మిక వాడల్లో దొంగల హల్‌చల్
- భయాందోళనలో కార్మిక కుటుంబాలు
- వారంలోనే మూడు క్వార్టర్స్‌లో చోరీలు
- సెక్యూరిటీ గస్తీ వైఫల్యమా..?
- కార్మికులతో పాటు వారి నివాసాలకు కూడా రక్షణ కల్పించరూ..?
- అసహనం వ్యక్తం చేస్తున్న సింగరేణి కార్మికులు
- గతంలోనూ పదుల సంఖ్యలో జరిగిన చోరీలు
- కార్మిక వాడల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు తప్పనిసరి
- రాత్రి వేళల్లో భద్రతా గస్తీ మరింత పెంచాలని విజ్ఞప్తి
- తమతో పాటు తమ క్వార్టర్స్‌కు రక్షణ కల్పించాలని డిమాండ్ - యాజమాన్యం ఎలా స్పందించేనో!





**ఇల్లందు, జులై 14 (ప్రజా జ్యోతి)** ఇల్లందు సింగరేణి కార్మిక వాడల్లో వరుస చోరీలు కార్మిక కుటుంబాల్లో తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇటీవల వారంలోనే మూడు క్వార్టర్స్‌లో దొంగతనాలు చోటుచేసుకోవడంతో కార్మికులు రాత్రి వేళల్లో నిద్రపోలేని పరిస్థితి నెలకొంది. దొంగలు ఇళ్లలోకి చొరబడి నగదు, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు అపహరిస్తుండటంతో భద్రతపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి విధిని నిర్వహిస్తున్న కార్మికులకు రక్షణ ఇవ్వడంతో పాటు, కార్మికులు నివసించే సింగరేణి క్వార్టర్స్ లలో కూడా రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సింగరేణి కార్మిక వాడల్లో గతంలోనూ అనేక చోరీలు జరిగినప్పటికీ యజమాన్యం ఏంటి చర్యలు తీసుకోకపోవడంతో కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీసం కార్మికవాడల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా యాజమాన్యం ముందుకు సాగడం లేదని పలువురు కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ››› వారంలో మూడు చోరీలు..

సింగరేణి కార్మిక వాడల్లో ఒకే వారంలో వరుసగా మూడు క్వార్టర్స్‌లో చోరీలు జరగడం కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. దొంగలు ముందస్తు ప్రణాళికతోనే కార్మిక వాడలను లక్ష్యంగా చేసుకుంటున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో కార్మికులు విధులకు వెళ్లినా, రాత్రి విధుల్లో ఉన్నా కుటుంబ సభ్యులు భయంతో గడుపుతున్నారు.

### ››› సెక్యూరిటీ గస్తీ ఎక్కడ..?

సింగరేణి సెక్యూరిటీ విభాగం సంస్థ ఆస్తులను పరిరక్షించడంతోపాటు కార్మిక వాడల్లో కార్మికులు, కార్మిక కుటుంబాలకు సైతం భద్రత కల్పించాల్సి ఉంటుంది. కానీ ఇల్లందు ఏరియా సెక్యూరిటీ విభాగం ఆ దిశగా ముందుకు రావడం వెళ్లడం లేదనే విమర్శలు వెలుగుతున్నాయి. సింగరేణి భద్రతా సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నప్పటికీ వరుస చోరీలు జరగడం గస్తీ వ్యవస్థపై అనుమానాలకు తావిస్తుందని కార్మికులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో భద్రతా తనిఖీలు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అనే ప్రశ్నలు కార్మికులు లేవనెత్తుతున్నారు.

### ››› గతంలోనూ చోరీల పరంపర!

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని కార్మికవాడల్లో చోరీలు జరగడం ఇదే మొదటిసారి కాదని, గతంలో కూడా కార్మిక వాడల్లో పదుల సంఖ్యలో చోరీలు చోటుచేసుకున్నాయి. అప్పట్లో కొంత కాలం గస్తీ పెంచినా, ప్రస్తుతం మళ్లీ నిర్లక్ష్యం కనిపిస్తుందని కార్మికులు ఆరోపిస్తున్నారు. తాము నివసించే కార్మిక వాడల్లో పూర్తిస్థాయి భద్రత కల్పించాలని సింగరేణి సంస్థను కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

### ››› సీసీ కెమెరాలే శాశ్వత పరిష్కారం

కార్మిక వాడల ప్రధాన వీధులు, కూడళ్లు, క్వార్టర్స్ పరిసరాల్లో అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. సీసీ కెమెరాలు ఉంటే నేరస్తులను గుర్తించడం సులభమవడంతో పాటు చోరీలకు అడ్డుకట్ట పడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా కార్మికవాడల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని కోరుతున్నారు.

### ››› గస్తీని ముమ్మరం చేయాలి

సింగరేణి కార్మిక వాడల్లో రాత్రి వేళల్లో భద్రతా సిబ్బంది వాహనాలతో నిరంతర గస్తీ నిర్వహించాలని, అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలని కార్మికులు కోరుతున్నాయి. పోలీసులతో సమన్వయంతో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కార్మికులు తమ విధుల్లో నిమగ్నమై సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న నేపథ్యంలో, వారి ప్రాణాలు, ఆస్తులకు కూడా పూర్తి రక్షణ కల్పించడం యాజమాన్యం బాధ్యతేనని కార్మికులు స్పష్టం చేస్తున్నారు. వరుస చోరీల నేపథ్యంలో యాజమాన్యం ఎలాంటి చర్యలు చేపడుతుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

### ››› కార్మిక వార్డుల్లో గస్తీ ముమ్మరం చేయాలి

**జె వెంకటేశ్వర్లు, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్, ఇల్లందు ఏరియా**



కార్మికవాడల్లో గస్తీని ముమ్మరం చేయాలి. సంస్థ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న కార్మికులతో పాటు కార్మిక కుటుంబాలకు రక్షణ కల్పించాలి. సెక్యూరిటీ సిబ్బందిని నిత్యం కార్మిక వార్డుల్లో తిరిగేలా చర్యలు చేపట్టాలి. ప్రధానంగా కార్మిక వాడలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. సింగరేణి క్వార్టర్స్ లలో జరిగే చోరీల నియంత్రణకు చర్యలు చేపట్టాలి. ఖాళీగా ఉన్న క్వార్టర్స్ లను కార్మికులతో భర్తీ చేయాలి.

## బోడు ఏరియా ఆటో అడ్డా కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా మహమ్మద్ షఫీ, కార్యదర్శిగా నెల్లూరి శ్రీను ఎన్నిక
- ఆటో కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి ఐఎఫ్‌టీయూ డిమాండ్





**టేకులపల్లి, జూలై 14, ప్రజాజ్యోతి:** టేకులపల్లి నుంచి పెట్రాంచెలక, ఎర్రాయిగూడెం, మొక్కంపాడు, బోడు తదితర గ్రామాలకు రాకపోకలు సాగించే బోడు ఏరియా ఆటో అడ్డా కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా మహమ్మద్ షఫీ, కార్యదర్శిగా నెల్లూరి శ్రీను, ఉపాధ్యక్షుడిగా సురేష్, సహాయ కార్యదర్శిగా గురుమూర్తి, కోశాధికారిగా దరవతు శ్రీనుతో పాటు మొత్తం 11 మంది సభ్యులతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు డి. ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు లేక అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసి కుటుంబాలను పోషిస్తున్నారని అన్నారు. ఇంటర్, డిగ్రీ, బీటెక్ వంటి ఉన్నత విద్యలు అభ్యసించి న యువకులు కూడా ఉద్యోగాలు లేక ఆటో డ్రైవర్లుగా జీవనం సాగించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఆటో కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఆటో కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడిందని, ఫైనాన్స్ వాయిదాలు చెల్లించడమే భారంగా మారిందని పేర్కొన్నారు. ఆటో కార్మికులకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. ప్రకటించిన సాయాన్ని తక్షణమే ఆటో కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. నూతనంగా ఎన్నికైన కమిటీ ఆటో కార్మికుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడంతో పాటు ప్రయాణికులతో సోదరభావంతో వ్యవహరించి ఆదర్శంగా నిలవాలని డి. ప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో మహేష్, సతీష్, చందు తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగ్ కాలేజ్ మంజూరు చేయాలని మంత్రికి ఎమ్మెల్యే వినతి





**ఇల్లందు, జులై 14 (ప్రజా జ్యోతి)** ఇల్లందులో నర్సింగ్ కాలేజ్ మంజూరు చేయాలని మంగళవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కు ఎమ్మెల్యే కోరం కనుక వినతిపత్రం అందజేశారు. ఇల్లందు ఆసుపత్రిలో 5 పడకల ఐసియూ, నూతన అంబులెన్స్ వాహనం, సిటి స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. అదేవిదంగా చల్లసముద్రం, సుదిమళ్ళ, బోడు గ్రామాలలో నూతన పిహెచ్ సి లు మంజూరు చేయాలని కోరారు. స్కానింగ్ సెంటర్ ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించి మంజూరు చేసేందుకు కృషి చేస్తానని మంత్రి తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన

- ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఏడీఏ లాల్ చంద్ సూచనలు



**టేకులపల్లి, జూలై 14, ప్రజాజ్యోతి:** ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశం ఉండటంతో పాటు పంటల దిగుబడులపై కూడా ప్రభావం పడే అవకాశముందని ఇల్లందు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు (ఏడీఏ) లాల్ చంద్ రైతులకు సూచించా రు. మంగళవారం ప్రేగళ్లపాడు రైతువేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. కాలువలు, చెరువుల ఆయకట్టు ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న నీటి లభ్యతను బట్టి వరి సాగుకు బదులుగా జొన్న, సజ్జలు, కందులు, మినుములు, నువ్వులు, అలసందలు, ఆముదం, కూరగాయల వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. అలాగే, భూమిలో తగిన తేమ ఏర్పడే వరకు ఎరువుల వినియోగాన్ని వాయిదా వేయాలని తెలిపారు. దీర్ఘకాలిక పొడి పరిస్థితులు కొనసాగితే పంటలకు ఉపశమనం కల్పించేందుకు 2 శాతం యూరియా ద్రావణం లేదా 1 శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని ఆకులపై పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేపడితే నష్టాలను తగ్గించుకోవచ్చని లాల్ చంద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేగళ్లపాడు సర్పంచ్ కొమరం హనుమంతు, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

## అరుణోదయ నాగన్న సంతాప సభను జయప్రదం చేయండి

- టేకులపల్లిలో పోస్టర్ ఆవిష్కరణ.. కళాకారులు, రచయితలు, ప్రజాసంఘాల నాయకులకు పిలుపు




**టేకులపల్లి, జూలై 14,ప్రజాజ్యోతి:** ప్రజాకవి, ప్రజా గాయకుడు అరుణోదయ నాగన్న సంతాప సభను ఈ నెల 25న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో,ఆ సభను విజయవంతం చేయాలని కోరుతూ టేకులపల్లిలో మంగళవారం సంతాప సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి ఎట్టి నరసింహారావు, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కల్తీ వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు డి. ప్రసాద్ మాట్లాడుతూ, "నాగన్న గొంతెత్తి పాడితే గోదావరి లోయంతా ప్రతిధ్వనించేది" అని అన్నారు. కష్టజీవుల జీవితాలను కేంద్రంగా చేసుకుని ఆయన రచించిన పాటలు ప్రజల్లో చైతన్యం నింపాయని, శ్రమజీవుల హక్కుల కోసం పోరాడే ఉద్యమాలకు ఆయుధాలుగా నిలిచాయని పేర్కొన్నారు.ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాజారాం గ్రామంలో సుమారు 70 ఏళ్ల క్రితం జన్మించిన నాగన్న పేద కుటుంబంలో పెరిగి చిన్ననాటి నుంచే ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. పశువుల కాపరిగా, జీతగాడిగా, వ్యవసాయ కూలీగా, తాటి చెట్లు ఎక్కే కార్మికుడిగా, దర్జీగా పనిచేస్తూనే ప్రజల బాధలను తన పాటల్లో ప్రతిబింబింపజేశారని తెలిపారు.చిన్నతనం నుంచే జానపద గేయాలు, యక్షగానాలు, బిచ్చగాళ్ల పాటలపై ఆసక్తి పెంచుకున్న నాగన్న, ఒకసారి విన్న పాటను తన ప్రత్యేక గానశైలిలో ప్రజల హృదయాలను తాకేలా ఆలపించేవారని కొనియాడారు. జీవితాంతం ప్రజల పక్షాన, విప్లవ సిద్ధాంతాలకు అంకితభావంతో పనిచేసిన ఆయన జీవితం ఆదర్శప్రాయమని, ఆయన ఆశయాలను కొనసాగించడం ద్వారా నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని పేర్కొన్నారు.జూలై 25న హైదరాబాద్‌లో నిర్వహించే సంతాప సభకు కళాకారులు, రచయితలు, సాహితీవేత్తలు, ప్రజాసంఘాల నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం మండల అధ్యక్షుడు గూగులోత్ రామచంద్, కార్యదర్శి భూక్యా హర్జ్యా, పీవైఎల్ మండల కార్యదర్శి తోటకూరి సతీష్, ధరావత్ వెంకన్న, ఐఎఫ్‌టీయూ నాయకులు డి. క్రాంతి కుమార్, బొడ మోహన్, బన్నీ, రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## చిట్టి రామవరం 1/70 భూముల్లో..

# రియల్టీ దందా..?

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

- 12 ఎకరాల్లో వెంచర్ చేసినట్లు ప్రచారం..
- అనుమతులు లేకుండానే కాగితాలపై ప్లాట్ల విక్రయాలన్న ఆరోపణలు..
- కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న స్థానికులు..

**కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామవరం–చిట్టి రామవరం ప్రాంతంలో సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో కొందరు రియల్ ఎస్టేట్ నిర్వాహకులు వెంచర్ ఏర్పాటు చేసినట్లు సమాచారం. అయితే ఈ భూమి 1/70 చట్టం పరిధిలో ఉన్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతుండటంతో వెంచర్ చట్టబద్ధతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం 1/70 చట్టం పరిధిలోని భూములను గిరిజనేతరులకు విక్రయించడం సాధ్యం కాదు. అలాగే అలాంటి భూముల్లో వెంచర్ ఏర్పాటుకు కూడా అనుమతులు లభించే అవకాశం ఉండదు. అయినప్పటికీ ఇక్కడ కొందరు వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్ల విక్రయాలకు పాల్పడుతున్నట్లు సమాచారం.**

స్థానికుల సమాచారం ప్రకారం, చాలా కాలంగా బీడుగా ఉన్న ఈ భూములను కార్పొరేషన్ పరిధిలో ఉన్నాయనే అంశాన్ని ఆసరాగా చేసుకుని వెంచర్‌గా రూపొందించినట్లు తెలుస్తోంది. అయితే సాధారణంగా వెంచర్లలో ఉండే అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, విద్యుత్ సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులు కల్పించకుండా కేవలం ప్లాట్ల మ్యాప్‌ను రూపొందించి దాని ఆధారంగానే విక్రయాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. వెంచర్ చుట్టూ మాత్రమే ప్రహరీ నిర్మించి, లోపల పెద్దగా అభివృద్ధి పనులు చేపట్టకుండా ఉంచడం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. బయటకు చూస్తే సాధారణ భూమిలా కనిపిస్తున్నప్పటికీ, కాగితాలపైనే ప్లాట్ల విక్రయాలు సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వెంచర్‌కు రెవెన్యూ శాఖ, డీటీసీపీ లేదా ఇతర సంబంధిత శాఖల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకున్నట్లు సమాచారం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించగా కూడా తమ దృష్టికి ఎలాంటి అధికారిక అనుమతులు రాలేదని తెలిపినట్లు సమాచారం. దీంతో వెంచర్ చట్టబద్ధతపై సందేహాలు మరింత బలపడుతున్నాయి. ఇప్పటికే ఈ వెంచర్‌లో పలువురు ప్లాట్లు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. కొనుగోలుదారుల్లో గిరిజనేతరులు కూడా ఉన్నారని సమాచారం. అయితే భూముల చట్టపరమైన హోదా, అనుమతులు, యాజమాన్యానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోకుండా ప్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో న్యాయపరమైన వివాదాలు తలెత్తే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంచర్‌కు సంబంధించిన భూముల అసలు స్వరూపం ఏమిటి? అవసరమైన అనుమతులు తీసుకున్నారా? ప్లాట్ల విక్రయాలు చట్టబద్ధంగానే జరుగుతున్నాయా? అనే అంశాలపై రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, గిరిజన సంక్షేమ శాఖలు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. విచారణ అనంతరం మాత్రమే ఈ వ్యవహారంపై పూర్తి వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

# విద్యుత్ సరఫరా నాణ్యత పెంపే లక్ష్యం

- భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ పనితీరుపై టీజీఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) సమగ్ర సమీక్ష.

**పాల్వంచ, జూలై 14, ప్రజాజ్యోతి:** వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ పరిధిలో విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని టీజీఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) టి. మధుసూదన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పాల్వంచలోని కేటీపీఎస్ జెన్‌కో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అండ్ ట్రైనింగ్ డెవలప్‌మెంట్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో చీఫ్ ఇంజనీర్ (ఆపరేషన్) రాజు చౌహాన్ తో కలిసి సర్కిల్ పరిధిలోని ఇంజినీరింగ్, ఎంఆర్టీ, కన్‌స్ట్రక్షన్, డీపీఈ, అకౌంట్స్ విభాగాల పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా 33 కేవీ, 11 కేవీ ఫీడర్ల ట్రిప్పింగ్స్, బ్రేక్‌డౌన్లు, లైన్ల నిర్వహణ, విద్యుత్ అంతరాయాల నివారణకు చేపట్టిన చర్యలను పరిశీలించారు. ట్రిప్పింగ్స్‌కు గల మూలకారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారాలు అమలు చేయాలని, నిర్వహణ పనులను మరింత సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్న లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలను ముందుగానే గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల (డీటీఆర్) వైఫల్యాలు తగ్గించేందుకు నెలవారీ నిర్వహణ, ఓవర్‌లోడింగ్ నివారణ, అవసరమైన ప్రాంతాల్లో అదనపు డీటీఆర్‌ల ఏర్పాటు వంటి చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. రాబోయే 2027–28 సమ్మర్ యాక్షన్ ప్లాన్లో భాగంగా కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 33 కేవీ, 11 కేవీ ఫీడర్లు, ఇంటర్‌లింకింగ్ లైన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. పిడుగుల ప్రభావంతో డీటీఆర్‌లు దెబ్బతినకుండా లైట్నింగ్ అరెస్టర్ల (ఎల్ఏలు) ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని, పిడుగు ప్రభావిత ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతులు, గ్రామీణ విద్యుత్ వినియోగదారులకు మరింత చేరువయ్యే "పొలం బాట", "ప్రజా బాట" కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ విద్యుత్ భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని, వారి సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే టీజీ ఐపాస్ కింద పరిశ్రమలు, ఇతర వర్గాల వినియోగదారులకు నిర్ణీత గడువులో విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని, 160 కేవీఏ మరియు అంతకంటే అధిక సామర్థ్యం గల డీటీఆర్‌లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని సూచించారు. కాలిపోయిన డీటీఆర్‌లను శాఖ వాహనాల ద్వారానే తరలిస్తూ మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు రైతులకు కొత్త విద్యుత్ కనెక్షన్లను సకాలంలో మంజూరు చేసి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందించాలని డైరెక్టర్ (ఆపరేషన్స్) స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ జి. మహేందర్, డీఈలు పి. నందయ్య (పాల్వంచ), రంగస్వామి (కొత్తగూడెం), జీవన్ కుమార్ (భద్రాచలం), వెంకటేశ్వర్లు (ఎంఆర్టీ), వెంకటేశ్వర్లు (డీపీఈ), ఎస్ఏఓ శ్రీధర్, సర్కిల్ పరిధిలోని ఏడీఈలు, ఏఈలు, ఏఏఓలు తదితర అధికారులు పాల్గొన్నారు.





# బ్లాక్‌మెయిల్ ఉచ్చులో మైనర్...?



- 2 టౌన్ పోక్సో కేసులో వెలుగులోకి వస్తున్న కొత్త అంశాలు
- ప్రజాజ్యోతితో మాట్లాడిన బాధితురాలి వాదనలు కలకలం
- పరిచయంతో మొదలై... బ్లాక్‌మెయిల్ ఆరోపణల వరకు..!
- మైనర్ వెల్లడించిన వివరాలతో దర్యాప్తులో కొత్త కోణం
- ప్రతి అంశాన్ని సమగ్రంగా విచారించాలన్న డిమాండ్
- మరికొందరి పాత్రపైనా ఆరా..?
- దర్యాప్తు వేగంపై స్థానికుల్లో ప్రశ్నలు
- నేడు పోలీసుల అధికారిక వివరణపై ఉత్కంఠ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 14, ప్రజా జ్యోతి:** ఆడుకుంటూ, చదువుకుంటూ భవిష్యత్తు గురించి కలలు కనాల్సిన ఓ మైనర్ బాలిక ఇప్పుడు తనకు ఎదురైన అనుభవాలను గుర్తు చేసుకుంటూ తీవ్ర మనోవేదనకు గురవుతోంది. తండ్రిని కోల్పోయిన ఆమెకు తల్లే అండగా నిలిచింది. అలాంటి సమయంలో ఏర్పడిన ఒక పరిచయం తన జీవితాన్ని ఇంతటి పరిస్థితికి తీసుకువస్తుందని ఆమె ఊహించి ఉండదు. తన నమ్మకాన్ని కొందరు దుర్వినియోగం చేశారని బాధితురాలు ఆరోపిస్తోంది. ప్రస్తుతం ఈ వ్యవహారం పోక్సో కేసుగా నమోదై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రజా జ్యోతితో తన సంరక్షకుల సమక్షంలో ఫోన్‌లో మాట్లాడిన సందర్భంగా బాధితురాలు వెల్లడించిన వివరాలు కలకలం రేపుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు రోజుల క్రితం నమోదైన ఈ కేసులో రోజుకో కొత్త అంశం వెలుగులోకి వస్తోంది. అయితే ఆమె చేసిన ఆరోపణల్లో ఎంతవరకు వాస్తవం ఉందనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఒక మైనర్ చేసిన ప్రతి ఆరోపణను అత్యంత సున్నితంగా, నిష్పాక్షికంగా విచారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

> **››› సాధారణ పరిచయంతో మొదలై... బ్లాక్‌మెయిల్ ఆరోపణల వరకు..!**

ప్రజా జ్యోతితో మాట్లాడిన సందర్భంగా బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం, మొదట ఒక యువకుడితో ఏర్పడిన సాధారణ పరిచయమే క్రమంగా మరికొందరితో పరిచయాలకు దారితీసిందని ఆమె వాదిస్తోంది. తొలుత నమ్మకం కల్పించి, తర్వాత బయటకు పిలిచేవారని, వేర్వేరు సందర్భాల్లో తన ఇష్టానికి విరుద్ధంగా వేధింపులకు గురిచేశారని ఆరోపించింది. అంతేకాకుండా, తనకు తెలియకుండా ఫోటోలు, వీడియోలు తీశారని, వాటిని మరికొందరికి పంపించి వాటినే అడ్డం పెట్టుకుని మానసికంగా వేధించారని కూడా ఆమె ఆరోపించింది. కొన్ని సందర్భాల్లో తనను ఒక పోలీసు సిబ్బంది నివాసానికి తీసుకెళ్లినట్లు కూడా పేర్కొంది. "మా మాట వినకపోతే ఫోటోలు బయటపెడతాం", "ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది" అంటూ బెదిరింపులు ఎదుర్కొన్నానని తెలిపింది. ఈ భయంతోనే జరిగిన విషయాలను వెంటనే బయటపెట్టలేకపోయానని, ఇదే విషయాన్ని దర్యాప్తు అధికారులకు కూడా వివరించినట్లు వెల్లడించింది. ఈ ఆరోపణల నిజానిజాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

> **››› ఆరోపణలను సమగ్రంగా విచారిస్తేనే..**

బాధితురాలు వెల్లడించిన అంశాల నేపథ్యంలో ఈ కేసులో ఇంకా పలు కోణాలు పరిశీలించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం స్థానికంగా వ్యక్తమవుతోంది. ఆమె చేసిన ప్రతి ఆరోపణను పోలీసులు సమగ్రంగా విచారిస్తేనే పూర్తి వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. ముఖ్యంగా మొబైల్ ఫోన్లు, ఫోటోలు, వీడియోలు, కాల్ డేటా, సందేశాలు వంటి డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తే ఘటనపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ప్రస్తుతం కొందరిపై మాత్రమే చర్యలు తీసుకున్నట్లు తెలిసినప్పటికీ, బాధితురాలు ప్రస్తావించిన ఇతర అంశాలపైనా పోలీసులు సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. దర్యాప్తులో లభించే ఆధారాల ఆధారంగానే తదుపరి చర్యలు ఉండే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు, కేసు నమోదై మూడు రోజులు గడిచినా దర్యాప్తు ఆశించిన వేగంతో సాగడం లేదనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. బాధితురాలు పేర్కొన్న అన్ని అంశాలను నమోదు చేశారా? డిజిటల్ ఆధారాలను స్వాధీనం చేసుకున్నారా? మరికొందరి పాత్రపైనా విచారణ జరుగుతోందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే ఒక మైనర్ చేసిన ఆరోపణలను అత్యంత సున్నితంగా పరిగణించి, ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా పూర్తి స్థాయిలో దర్యాప్తు జరపాలని మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. దర్యాప్తులో ఎవరి పాత్ర ఉన్నట్లు తేలినా చట్ట ప్రకారం ఒకే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ వ్యవహారంపై స్పందన కోసం ప్రజా జ్యోతి పోలీసులను సంప్రదించగా, కేసు దర్యాప్తు కొనసాగుతోందని, పూర్తి వివరాలను నేడు అధికారికంగా వెల్లడించే అవకాశం ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి. దీంతో ఈ కేసు దర్యాప్తు ఏ దిశగా సాగుతుంది? ఇంకా ఎలాంటి అంశాలు వెలుగులోకి వస్తాయి? అనే ఆసక్తి జిల్లా వ్యాప్తంగా నెలకొంది.



## రాజీ ప్రయత్నాలపైనా దర్యాప్తు జరగాలన్న డిమాండ్ ..

ఈ కేసు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో, ఘటన బయటకు వచ్చిన ప్రారంభ దశలోనే రాజీ ప్రయత్నాలు జరిగాయనే ప్రచారం స్థానికంగా వినిపిస్తోంది. బాధిత కుటుంబం తీవ్ర ఆందోళనలో ఉన్న సమయంలో కొందరు వ్యక్తులు మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ కేసు పోలీసుల వరకు వెళ్లకుండా చూసే ప్రయత్నం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానికంగా వినిపిస్తున్న ప్రచారం ప్రకారం, పత్రికా రంగంతో సంబంధం ఉన్న రామవరం కు చెందిన ఓ వడ్డీ వ్యాపారి (ప్రజా జ్యోతి రిపోర్టర్ కాదని స్పష్టీకరణ), గతంలో ఒప్పంద ప్రాతిపదికన డ్రైవర్ గా పనిచేసిన మరో వ్యక్తి , వీళ్ళతోపాటు వైద్య వృత్తికి చెందిన మరో వ్యక్తి, ఇంకొందరు కలిసి ఇరువైపుల కుటుంబాలతో మాట్లాడినట్లు చర్చ జరుగుతోంది. అయితే ఈ ప్రచారంలో ఎంతవరకు వాస్తవం ఉందనేది దర్యాప్తులోనే తేలాల్సి ఉంది. నిజంగానే రాజీ ప్రయత్నాలు జరిగాయా? జరిగి ఉంటే వాటి వెనుక ఎవరు ఉన్నారు? బాధిత కుటుంబంపై ఎవరైనా ఒత్తిడి తీసుకొచ్చారా? కేసు ముందుకు వెళ్లకుండా ప్రయత్నించారా? సాక్షులు లేదా వాంగ్మూలాలపై ప్రభావం చూపే ప్రయత్నం జరిగిందా? అనే అంశాలపై కూడా పోలీసులు సమగ్రంగా విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు. ప్రధాన ఘటనతో పాటు, ఘటన తర్వాత జరిగిన ప్రతి పరిణామాన్ని కూడా దర్యాప్తు పరిధిలోకి తీసుకుంటేనే పూర్తి వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వారు అభిప్రాయపడుతున్నారు.